


చౌడేశ్వరీ దేవికి విరాళం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయ అభివృద్ధికి ప్రొద్దుటూరుకు చెందిన పల్లా రవీంద్రబాబు, ఆయన తండ్రి పల్లా శేషయ్య రూ.2.50 లక్షలు విరాళమిచ్చారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ లవన్న అర్చకులు పాల్గొన్నారు.



గుబాళిస్తున్న వాము సాగు!

పెట్టుబడి వ్యయం తక్కువ, నికరాదాయం ఎక్కువగా ఉండటంతో రైతులు వాము సాగుపై మక్కువ చూపుతున్నారు. గత ఏడాది 5,200 ఎకరాల్లో ఈ పంటను పండించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి పీజీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో రాయలసీమ యూనివర్సిటీ, సిల్వర్‌జూబ్లీ కళాశాల, జ్యోతిర్మయి డిగ్రీ కాలేజీ (ఆదోని), నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పీజీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్ 476 మంది, సప్లిమెంటరీ 137, పీజీ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ 523, సప్లిమెంటరీ 210 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకోవాలని సూచించారు.

ముగ్గురు డిగ్రీ అధ్యాపకులకు రాష్ట్రస్థాయి అవార్డులు

- ఈ నెల 5న విశాఖపట్నంలో పురస్కారాల ప్రదానం



ఇంద్రావతి, అక్తర్ బాను, ఫామిదా బేగం

కర్నూలు సిటీ: జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు డిగ్రీ అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. కర్నూలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో బయోటెక్నాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జి ఇంద్రావతి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ఇంగ్లిష విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ హెచ్ అక్తర్ బాను, అదే కాలేజీలో తెలుగు శాఖ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం ఫామిదా బేగం అవార్డులకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 5వ తేదీన విశాఖపట్నంలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు.

అతివలకు ఆర్థిక ఆలంబన

- త్వరలో నాల్గో విడత వైఎస్సార్ కాపు నేస్తం అమలు
- ఉమ్మడి జిల్లాలో 7,083 మంది లబ్ధిదారులు
- బ్యాంక్ ఖాతాలకు జమకానున్న రూ.10.62 కోట్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



కర్నూలు(అర్బన్): నిరుపేద మహిళలకు ఆర్థిక సాయం చేస్తూ సమాజంలో వారి ఆత్మగౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచుతోంది. ఇందుకోసం కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు జీవనోపాధులను మెరుగు పరచుకుంటున్నారు. సమాజంలో హుందగా బతుకుతున్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం ఆర్థిక స్వావలంబన లభిస్తోంది. కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన మహిళల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు వారి ఆర్థిక పురోగతికి వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా ఏడాదికి రూ.15 వేలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి వరుసగా ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది ఠంచన్‌గా కాపు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతూనే ఉంది. మూడేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగించిన ప్రభుత్వం తాజాగా నాల్గో విడత నగదు జమ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వం విడుదల చేస్తున్న ఈ మొత్తంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక మంది మహిళలు ఇళ్ల వద్దే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనోపాధులను మెరుగు పరచుకుంటున్నారు. కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

సరళమైన నిబంధనలతో పథకం వర్తింపు

ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన కాపు మహిళలకు సరళమైన నిబంధనలను విధించింది. అభ్యర్థులు 45 నుంచి 60 సంవత్సరాల లోపు వారై ఉండాలి. గ్రామాల్లో నివాసం ఉంటున్న వారి వార్షిక ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో ఉన్న వారు రూ.12 వేలు కలిగి ఉండాలి. ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర కుల ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు (ఆధార్, ఓటరు) కలిగిన వారై తమకు సమీపంలోని బ్యాంకుల్లో ఖాతా కలిగిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

మూడు విడతల్లో విడుదలైన లబ్ధిదారుల జాబితా..

జిల్లా	విడుదలైన సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	విడుదలైన మొత్తం(రూ.ల్లో)
కర్నూలు	24-06-2020	1184	1,77,60,000
	22-07-2021	1240	1,86,00,000
	29-07-2022	1403	2.10,45,000
నంద్యాల	24-06-2020	4817	7,22,55,000
	22-07-2021	4949	7,42,35,000
	29-07-2022	5446	8,16,90,000

నాల్గో విడతలో విడుదల కానున్న నిధులు, లబ్ధిదారుల వివరాలు..

కర్నూలు	1,510	2,26,50,000
నంద్యాల	5573	8,35,95,000

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

ఏదైనా చిన్న వ్యాపారం చేసుకొని కుటుంబాన్ని పోషించుకునేందుకు నెలకు నూటికి మూడు రూపాయలు వడ్డీ ఇస్తామంటే అప్పు దొరకని పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.15 వేలు ఉచితంగా అందిస్తున్నారు. ఈ డబ్బుతో నేను రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నాను. వరుసగా మూడు సంవత్సరాలు ఏడాదికి రూ.15 వేల ప్రకారం రూ.45 వేలు విడుదలయ్యాయి. మాలాంటి పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – పి చిట్టెమ్మ, నందనపల్లి, కర్నూలు మండలం

ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిది



మాకు చిన్న కిరాణా షాపు ఉంది. ప్రభుత్వం కాపు నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు అందిస్తోంది. ఈ డబ్బుతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటున్నాం. కిరాణా షాపునకు తోడు దీపిక ఫాస్ట్ ఫుడ్ సెంట ర్, చికెన్ పకోడా స్టాల్‌ను ప్రారంభించాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. ప్రతి పేదవాన్ని ఆదుకునేందుకు అనేక పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారు. – రాగిశెట్టి ఉమాదేవి, పోలూరు గ్రామం, నంద్యాల మండలం

జాబితాలు సిద్ధంగా ఉన్నాయి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కాపు నేస్తం పథకానికి సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాలో అర్హుల జాబితాలను సిద్ధం చేశాం. ఇప్పటి వరకు మూడు విడతల్లో రెండు జిల్లాల్లో 19,039 మంది లబ్ధిదారులకు రూ. 28,55,85,000 విడుదలయ్యాయి. ప్రస్తుతం నాల్గో విడతలో రెండు జిల్లాల్లో 7,083 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.10,62,45,000 జమ కానున్నాయి. –ఎస్ జాకీర్‌హుసేన్, ఈడీ, బీసీ కార్పొరేషన్

ముగిసిన మహా సంప్రోక్షణ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: అహోబిలం నవనారసింహ క్షేత్రాల్లోని మాలోల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న జీర్ణోద్ధరణ అష్టబంధన మహా సంప్రోక్షణం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ విమాన గోపురానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలతో విశ్వరూపం, చతుస్థానార్చన, మహాపూర్ణాహుతి, యాత్రదానం, గ్రహప్రీతి, దశదానం, కుంభ సంప్రోక్షణం తదితర కార్యక్రమాలతో పూజలు ముగించారు.

శ్రీశైలంలో భక్తులరద్దీ



శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీశైలంలో రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. శివ నామస్మరణతో శ్రీశైలం క్షేత్రం మారుమోగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలలో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం, తాగునీరు, బిస్కెట్లు అందించారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిక్కిరిశాయి. స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం భక్తులు అన్నపూర్ణ భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వెల్దుర్తి వంక

‘వర్షా’తిరేకం

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు
- ప్రాణం పోసుకున్న ఖరీఫ్ పంటలు
- కోవెలకుంట్లలో అత్యధిక వర్షపాతం
- పొంగిన వాగులు, వంకలు
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. పంటలు వాడుముఖం పడుతున్న తరుణంలో కుంభవృష్టి కురిపించాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదివారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. ఒక్క వానకే పలు ప్రాంతాల్లో చెరువులు నిండిపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో 73.2 మి.మీ. వర్షపాతం నమోదు కావడం విశేషం. కర్నూలు జిల్లాలో సగటున 19.8, నంద్యాల జిల్లాలో సగటున 53.4 మి.మీ. వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఆదోనిలో 98.5 మి.మీ.,అత్యల్పంగా గోనెగండ్లలో 3.6 మి.మీ., నంద్యాల జిల్లాలో అత్యధికంగా కోవెలకుంట్లలో 150.0మి.మీ. (15 సెం.మీ), అత్యల్పంగా ప్యాపిలిలో 9.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో వివిధ మండలాల్లో 10 సెం.మీ. పైగా వర్షం పడటం విశేషం. గోస్పాడు 11.4, చాగలమర్రి 10.2, ఉయ్యాలవాడలో 10.2 సెం.మీ. వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లాలో సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. ఉండగా... మొదటి మూడు రోజుల్లో 20.9. మిమీ వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లా సాధారణ వర్షపాతం 134 మి.మీ. ఉండగా మూడు రోజుల్లోనే 57.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.



గోవర్ధనగిరి సమీపంలో చెక్‌డ్యాం నిండి ప్రవహిస్తున్న దృశ్యం

ప్రత్యామ్నాయ పంటలకు అవకాశం..

వర్షాలు పడటంతో ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం ఏర్పడింది. వ్యవసాయ శాఖ కూడా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కర్నూలు జిల్లాలో పత్తి 2.50 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. అయితే 1.80 లక్షల హెక్టార్లకు సాగు పరిమితం అయ్యింది. వర్షాభావంతో ప్రధాన పంటలైన పత్తి, వేరుశనగ, కూరగాయలు పంటల సాగుకు అవకాశం లేకుండా పోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. వర్షాధారం కింద సెప్టెంబరు నెలలో ఎర్ర నేలలు, నల్ల రేగడి నేలల్లో వేసుకోదగిన పంటల వివరాలను కర్నూలు డీఏవో వరలక్ష్మి వివరించారు. సెప్టెంబరు నెలలో ఎర్ర నేలల్లో జొన్న, గోరు చిక్కుడు, సజ్జ, పెసర, అలసంద, ఉలవ, అనుము పంటలు వేసుకోవచ్చని తెలిపారు. నల్లరేగడి నేలల్లో జొన్న, గోరుచిక్కుడు, పెసర, అలసంద, పొద్దుతిరుగుడు, కొర్ర, అనుము వంటి పంటలు సాగు చేసుకోవచ్చని ప్రకటించారు.

నంద్యాల జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు...

మండలం	కురిసిన వర్షం (మి.మీ.లలో)
కోవెలకుంట్ల	150.0
గోస్పాడు	114.2
చాగలమర్రి	102.0
ఉయ్యాలవాడ	100.2
దొర్నిపాడు	79.4
సంజామల	78.0
గడివేముల	74.6
నందికొట్కూరు	74.2
ఆళ్లగడ్డ	67.4
మిడుతూరు	58.8
పాణ్యం	57.8
బనగానపల్లె	57.2
బేతంచెర్ల	55.2
జూపాడుబంగ్లా	52.4
వెలుగోడు	51.2
కర్నూలు జిల్లాలో...	
ఆదోని	94.8
వెల్దుర్తి	84.0
కృష్ణగిరి	64.4
దేవనకొండ	45.8
పెద్దకడబూరు	40.4

పంటలకు ప్రాణం...

ఆలస్యంగానైన భారీ నుంచి అతి భారీ వర్షాలు పడటంతో వివిధ పంటలు కోలుకునే అవకాశం ఏర్పడింది. కర్నూలు జిల్లాలో చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లాలో 3.02 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. పత్తి, వేరుశనగ, ఆముదం, కంది, సజ్జ, మొక్కజొన్న, ఉల్లి, మిర్చి పైర్లు వివిధ దశల్లో ఉన్నాయి. వర్షాభావంతో కొన్ని పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పత్తి, కంది, మొక్కజొన్న వంటి పంటలు పూర్తిగా కోలుకునే అవకాశం లభించింది .వేరుశనగ కూడా కొంతవరకు ప్రాణం పోసుకుంది. నంద్యాల జిల్లాలో 1.31 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ జిల్లాలో పత్తి, మినుము, మొక్కజొన్న, కంది సాగు చేశారు. నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో అన్ని పంటలు కోలుకునే అవకాశం ఏర్పడింది.



జూపాడుబంగ్లా మండలంలో మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షం నీరు



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో పోటెత్తిన కుందూనది

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధన వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అశ్వవాహనాధీశుడైన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి 352వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో వేకువ జామున 5.30 గంటల నుంచే సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు, రాయరు పాదపూజ, మూలదేవర సంస్థాన పూజ, శ్రీరాఘవేంద్రస్వామి మఠం 13వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన చేపట్టారు. రాత్రి 10 గంటలకు ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వ వాహనంపై మంగళ వాయిద్యాలు, దాస సాహిత్య మండలి మహిళల భజనలు, అశేష భక్త జనం హర్ష ధ్వానాలు మధ్య శ్రీమఠం మాడ వీధుల్లో ఊరేగారు. అనంతరం చెక్క, వెండి, అంబారి, స్వర్ణ రథయాత్రలు నిర్వహించారు.వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీమఠం యోగీంద్ర మంటపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన నాట్య సరస్వతి కూచిపూడి నృత్యం ఆకర్షించింది. పుత్తూరు విద్వాన్ జగదీష్ ఆచార్య దాసవాణి భక్తి గేయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరు శ్రీశారద కళా కేంద్ర ట్రస్టు బృందం భరతనాట్య ప్రదర్శనలకు భక్తులు మంత్రముగ్ధులయ్యారు. వేడుకలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ఏపీఆర్వో బిందుస్వామి పాల్గొన్నారు.



దర్శన క్యూలైన్లలో బారులు తీరిన భక్తజనం

నేటి కార్యక్రమాలు..

ఆరాధనోత్సవాల్లో ఆఖరిరోజు సోమవారం సర్వసమర్పణోత్సవం జరుగనుంది. ఏక కాలంలో పంచవాహనాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు, రాఘవేంద్రులను శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగిస్తారు. ఉదయం అనుమంత్రాలయం తుంగభద్ర గ్రామంలో మృత్తిక బృందావన క్షేత్రంలో ఆరాధన వేడుకలు, రథయాత్ర నిర్వహిస్తారు.



మాట్లాడుతున్న ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్యక్షుడు రెహమానీ సహాజ్, చిత్రంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

ముస్లింల ఐక్యత అవసరం

- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్యక్షుడు హజ్రత్ మౌలానా ఖాలీద్ సైఫుల్లా రెహమానీ సహాజ్

కర్నూలు (టౌన్): దేశంలో ముస్లింల ఐక్యత అవసరమని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్యక్షుడు హజ్రత్ మౌలానా ఖాలీద్ సైఫుల్లా రెహమానీ సహాజ్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జమాతుల్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. మారుతున్న దేశ పరిస్థితులు– మన బాధ్యత అన్న అంశంపై నిర్వహించిన ఈ సభకు ముస్లిం నేతలు, ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రస్తుత దేశ పరిస్థితులపై మరింత అవగాహన పెంచుకొని ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చదువు ద్వారా సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి పాటు పడే వారిని ఎన్నుకుందామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలు అధికంగా ఉన్నారని, చట్ట సభల్లో సంఖ్య పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా కర్నూలుకు ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్యక్షుడు రావడం సంతోషంగా ఉందన్నారు. అక్షరాస్యత పెరిగినప్పుడే ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. బహిరంగ సభలో వర్షం కోసం ముస్లింలు దువా చేశారు. కార్యక్రమంలో జుబేర్ మౌలానా, జకీర్ మౌలానా, హజ్రత్ మౌలానాషా ఖాద్రి సయ్యద్ ముస్తఫా జిలానీ నాద్వి సహేబ్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు కార్యదర్శి ఉమర్ అబిదీన్, అఫ్సర్ ఖాద్రీ, మోటీవేషనల్ స్పీకర్ బ్రదర్ సిరాజ్ ఉర్ రెహిమాన్, నిజాముద్దీన్, సులేమాన్ ఖాన్, షావలి, వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, ముస్లింలు పాల్గొన్నారు.



బహిరంగ సభకు భారీగా తరలి వచ్చిన ముస్లింలు

క్లుప్తంగా

గోడ కూలి వ్యక్తి దుర్మరణం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఇంటి గోడ కూలి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తాటి రామ సుబ్బయ్య (57) ఉదయం ఆరు గంటల సమయంలో పశువుల పాక శుభ్రం చేస్తుండగా రాత్రి నుంచి వర్షానికి తడిసిన పశువుల పాక గోడ కూలిపోయింది. భార్య తాటి ఆదిలక్ష్మి, చుట్టుపక్కల వారి సాయంతో రాళ్లను తొలగించి చూడగా రామసుబ్బయ్యతో పాటు బర్రె మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి

మిడుతూరు: వివాహం కాలేదనే మనోవేదనతో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ మారుతీశంకర్ తెలిపిన వివరాలు.. పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన కుమార్(29) గత నెల 25న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సముద్రాల హనుమంతరావు మృతి



కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అన్యాక్రాంతుల ఆస్తుల పరిరక్షణ చైర్మన్ సముద్రాల హనుమంత రావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆయనను సమస్య తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్చారు. కోలుకోలేక ఆయన తెల్లవారుజామున కన్ను మూశారు. ఆయన బ్రాహ్మణ సంక్షేమ సంఘంలోనూ సేవలందించారు. ఆయన మృతికి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటరామరాజు, నగరంలోని ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

చిన్నారిపై పిచ్చి కుక్కదాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో ఆదివారం చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసింది. నంద్యాల మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, కవిత దంపతులు.. తమ కుమార్తె చిన్నారి రిషితతో కలిసి యంబాయి గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చారు. ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ఉన్న రిషితపై పిచ్చికుక్కదాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

ఐరన్‌బండ ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

- హుండీలో నగదు, వెండి అపహరణ



దేవాలయానికి దూరంగా పడేసిన హుండీ

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం ఎల్లమ్మ దేవాలయానికి ప్రజలు పూజలు చేసేందుకు వెళ్లారు. అయితే దేవాలయంలో ఉన్న హుండీ దూరంగా పడేసి ఉంది. అందులో నగదు, వెండిను చోరీ చేశారని ఆలయ సిబ్బంది తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మ దేవాలయం హుండీలో వేసిన నగదును సంవత్సరానికి ఒక్కసారి లెక్కిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏఎస్‌ఐ తిమ్మారెడ్డి చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

గుబాళిస్తున్న వాము సాగు!

- గత ఏడాది 5,200 ఎకరాల్లో పంట
- ఈ ఏడాది 10వేలకుపైగా ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- తక్కువ పెట్టుబడి.. నికరాదాయం ఎక్కువ
- కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో క్రయవిక్రయాలు



సాగులో ఉన్న వాము పంట

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావంతో ఖరీఫ్ సీజన్ నిరాశకు గురిచేయడంతో రైతులు వాము పంటపై దృష్టి సారిస్తున్నారు. పెట్టుబడి వ్యయం తక్కువ, నికరాదాయం ఎక్కువగా ఉండటంతో రైతులు ఈ పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ క్రాప్ ప్రకారం ఇప్పటికే జిల్లాలో 500 ఎకరాల్లో సాగైంది. సెప్టెంబరు నెలలో విత్తుకునే అవకాశం ఉండటంతో సాగు విస్తీర్ణం పెరగనుంది. రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో ఈ పంట సాగవుతోంది. గత ఏడాది 5,200 ఎకరాల్లో ఈ పంటను పండించారు. జిల్లాలో పత్తికొండ, మద్దికెర, ఆదోని, ఆస్పరి, దేవనకొండ, ఓర్వకల్లు, కోడుమూరు, తుగ్గలి, పెద్దకడుమూరు, వెల్దుర్తి తదితర మండలాల్లో సాగు ఎక్కువగా ఉంది. వర్షాధారం కింద మూడు నెలలు, నీటి ఆధారం కింద 4 నెలల్లో పంట చేతికి వస్తుంది.

ప్రత్యామ్నాయంగా..

ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటగా రైతులు వాము సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పత్తి సాధారణ సాగు 6.30 లక్షల ఎకరాలు ఉండగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 4.53 లక్షల ఎకరాలకే పరిమితమైంది. పత్తి సాగుకు అదను దాటిపోవడంతో రైతులు వాముపై దృష్టి సారిస్తున్నారు. గతేడాది మద్దికెర మండలంలోనే 1,236 ఎకరాల్లో వామును సాగు చేశారు. అలాగే పత్తికొండ మండలంలో 837 ఎకరాల్లో సాగైంది. ఈ సారి 10 వేల ఎకరాలకుపైగా సాగు కావచ్చని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి అవసరం పెద్దగా లేకపోవడం, శ్రమ తక్కువగా ఉండటం, చీడపీడల ప్రభావం ఉండకపోవడంతో వాము సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు పెట్టుబడి వ్యయం గరిష్ఠంగా రూ.10 వేల వరకు ఉంటుంది. సగటున ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటాల్‌కు సగటున రూ.15 వేల వరకు ధర లభిస్తుంది. పెట్టుబడి వ్యయం పోగా ఎకరాకు రూ.35 వేల వరకు నికరాదాయం పొందే అవకాశం ఉంది.

మార్కెటింగ్ సదుపాయం

జిల్లాలో పండించిన వామును కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్ముకునే సదుపాయం ఉంది. మార్వాడి వ్యాపారులు వాము కొనుగోలు చేస్తున్నారు. 2022-23లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 95,381 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కనిష్ఠ ధర రూ.2,500, గరిష్ఠ ధర రూ.26,666, మోడల్ ధర రూ.10,800 లభించింది. 2023-24 ఆగష్టు నెల వరకు మార్కెట్‌కు 22,462 టన్నులు వచ్చింది. కనిష్ఠ ధర రూ.5,000, గరిష్ఠ ధర రూ.27,611, మొడల్ ధర రూ.14,200 లభించింది. కొందరు వ్యాపారులు రైతుల దగ్గరకే వెళ్లి వాము కొనుగోలు చేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

మన దేశంలో 80 శాతం ఇళ్లలో వాము తప్పనిసరిగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. ఒక విధమైన ఘాటు సువాసన వచ్చే వాము మొక్క మొత్తం ఔషధ గుణాలతో ఉంటుంది. తిన్న ఆహారం అరగకపోతే, త్రేన్పులు, ఏసీడీటీ సమస్య ఉంటే కొద్దిగా వాము నమిలి మింగితే చాలు. ఒక టీ స్పూన్ జీలకర్ర, ఒక టీస్పూన్ వాము, అర టీస్పూన్ అల్లం పొడిని నీటిలో కలిపి తాగితే ఛాతీలో మంటలు తగ్గి పోతాయి. పిల్లలకు రోజూ ఒక మూత వాము వాటర్ తాపితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. కడుపు నొప్పికి వాము అద్భుతంగా పనిచేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వాముతో బహుళ ప్రయోజనాలు ఉండటంతో దీనికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటోంది.

10 ఎకరాల్లో సాగు చేశాం



మా గ్రామానికి వాము ప్రధాన పంట. భూమి కలిగిన ప్రతి రైతు ఈ పంటను సాగు చేస్తారు. మేము దశాబ్దకాలంగా వాము సాగులో రాణిస్తున్నాం. ఈ సారి 10 ఎకరాల్లో విత్తుకున్నాం. గత ఏడాది 8 ఎకరాల్లో సాగు చేశాం. ఎకరాకు సగటున 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.15000 ధర లభించింది. నాణ్యత బాగుంటే రూ.20 వేలకు పైగా ధర లభిస్తుంది. ఈ సారి వర్షాలు సరిగా పడకపోవడంతో పత్తి, టమాట పూర్తిగా సాగు కాలేదు. దీంతో రైతులు వాము సాగు చేస్తారు.

– బి.సుబ్బయ్య, బురుజుల, మద్దికెర మండలం

సెప్టెంబర్ నెల అనుకూలం



వాము సుగంధ ద్రవ్యాల పంట. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ పంట సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. వాము సాగుకు ప్రత్యేకంగా సీడ్ లేదు. షాపుల్లో అమ్ముతున్న వాముతోనే విత్తుకోవచ్చు. ఎకరాకు కిలో సరిపోతుంది. సెప్టెంబరు నెల మొత్తం వాము సాగుకు అనుకూలం. ఈ సారి 10 వేలకుపైగా ఎకరాల్లో ఈ పంట సాగు అయ్యే అవకాశం ఉంది. వాములో ఎటువంటి సమస్యలు వచ్చిన వాటిని పరిష్కరించేందుకు ఉద్యాన శాఖ తగిన చర్యలు తీసుకుంటోంది.

– రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

ఎల్లెల్సీలో 571 క్యూసెక్కుల నీటి ప్రవాహం



హొళగుంద వద్ద ప్రవహిస్తున్న ఎల్లెల్సీ

హొళగుంద: జిల్లా సరిహద్దులో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో 250 కి.మీ. వద్ద 571 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం సమయానికి తుంగభద్ర జలాశయంలో 74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 542 క్యూసెక్కుల వరకు మాత్రమే ఇన్‌ఫ్లో ఉంది. వివిధ కాలువల ద్వారా 10,158 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదు గేట్ల ద్వారా ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి వెళ్తున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 2,000 క్యూసెక్కుల నీటిసరఫరా కొనసాగుతున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా 2వేల క్యూసెక్కుల నీరు ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి ఎస్సార్బీసీ(జీఎన్ఎస్ఎస్)కాల్వకు 1,500క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 500 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి జానపద నృత్యోత్సవాలు

కర్నూలు కల్చరల్: సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు జానపద నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జగన్నాథన్, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల వివరాలను వెల్లడించారు. దేశంలో మొత్తం ఏడు కల్చరల్ జోన్‌లు ఉన్నాయన్నారు. దక్షిణ భారత దేశంలోని ఐదు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకొని తంజావూరు కేంద్రంగా ప్రతి సంవత్సరం ఒక ప్రాంతంలో ఉత్సవాలు జరుగుతుంటాయన్నారు. ఈ ఏడాది కర్నూలులో ఏర్పాటు చేశామన్నారు. 5వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు డైరెక్టర్ కె.కె.గోపాలకృష్ణ, జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా ప్రజా ప్రతినిధులు రోజుకొకరు చొప్పున ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.



మాట్లాడుతున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

ప్రతీకారంతోనే ఆటోడ్రైవర్ హత్య

- డీఎస్పీ శ్రీనివాసులు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట గత నెల 29న జరిగిన ఆటో డ్రైవర్ హత్యను పోలీసులు ఛేదించారు. ప్రతీకారంతోనే హత్య జరిగిందని నిగ్గు తేల్చారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు నిందితుడిని అరెస్ట్ చూపి, వివరాలను వెల్లడించారు. ప్యాపిలి మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆనెగొంది లక్ష్మన్న(54) చిగురుమాన్ క్రాస్ వద్ద నివాసం ఉంటున్నాడు. గత నెల 29న హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. 2022 జనవరి 12న జరిగిన ప్యాపిలి మండలం బావిపల్లికి చెందిన శ్రీనివాసులు హత్య కేసులో మృతుడు లక్ష్మన్న ముద్దాయి అని తెలుసుకుని ఆ దిశగా విచారణ చేపట్టారు. శ్రీనివాసులు సోదరుడు బింగి రంగారావును అదుపులోకి తీసుకుని విచారించారు. తన తమ్ముడిని హత్య చేసిన విషయాన్ని మనసులో ఉంచుకున్న రంగారావు... అదను కోసం వేసి ఉన్నాడు. గత నెల 29న లక్ష్మన్న కర్నూలుకు వాయిదాకు వెళ్లి తిరిగి డోన్‌కు చేరుకుని ఆటో రిపేరు చేయించుకునేందుకు వ్యవసాయ మార్కెట్ వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న రంగరావు అతడిని చూసి ఇంటికెళ్లి హెల్మెంట్ ధరించి, వేటకొడవలితో వచ్చి నరికి చంపాడు. నేరం అంగీకరించడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి హెల్మెట్, వేటకొడవలి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



మృతుడు డీఎండీ మహమ్మద్‌బాషా(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కారు



గాయపడిన ఇమ్రాన్

ఎమ్మిగనూరురూరల్: వేగంగా దూసుకొచ్చిన కారు ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు పట్టణం ఎస్ఎంటీ కాలనీకి చెందిన డీఎండీ మహమ్మద్ బాషా(30) జార్ఖండ్ రాష్ట్రంలోని బరాకర్ దగ్గర సీఐఎస్ఎఫ్ పోలీస్‌గా విధులు నిర్వహించేవాడు. ఈయనకు భార్య రేష్మా, కుమారులు యూసూఫ్, ఇసాక్, షకీనాలు ఉన్నారు. కరోనాతో 2021లో సోదరుడు అబ్దుల్లా మృతి చెందటం, తండ్రి ఉసేన్‌కు ఆరోగ్యం బాగలేకపోవటంతో డీఎండీ మహమ్మద్ బాషా విధులకు వెళ్లకుండా ఇంటి దగ్గర ఉండి కుటుంబాన్ని చూసుకునేవాడు. ఆదివారం ఉదయం స్నేహితుడు ఆర్‌ఎంపీ అయిన ఇమ్రాన్‌తో కలిసి మోటారు సైకిల్‌పై మార్కెట్ యార్డ్ వైపు వెళ్తుండగా బెంగుళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో డీఎండీ మహమ్మద్‌బాషా, ఇమ్రాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఉరుకుందకు విధుల కోసం వెళ్తున్న టౌన్ సీఐ మధుసూదన్‌రావు గాయపడ్డవారిని గమనించి ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపే డీఎండీ మహమ్మద్‌బాషా మృతి చెందాడు. మరో వ్యక్తి ఇమ్రాన్‌కు తలకు బలమైన గాయం కావటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మృతుడి తల్లి ముంతాజ్, భార్య రేష్మా తన ముగ్గురు పిల్లలతో ప్రభుత్వాసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బోయ రామకృష్ణ విలేకరులకు తెలిపారు.

'గ్రాస్' సర్వే వంద శాతం పూర్తి చేయాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



వర్క్ షాపును పర్యవేక్షిస్తున్న డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష పీఓ వేణుగోపాల్

కల్లూరు: జిల్లాలోని అన్ని మండలాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలో బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్)సర్వే 100 శాతం పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య టెలీకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. జిల్లాలో బడి బయట ఉన్న 15 నుంచి 18 సంవత్సరాలలోపు వారి వివరాలు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాళ్లకు సూచించారు. రెండు రోజుల్లో గుర్తించిన విద్యార్థులందరినీ కళాశాలలో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇంకా 31,600 మంది పిల్లల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే పెండింగ్‌లో ఉందన్నారు. ఇదిలా ఉండగా కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో జరుగుతున్న బడిఈడు పిల్లల నమోదు వర్క్ షాపును జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఈ వర్క్‌షాపులో మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

చిరుత దాడిలో రెండు జీవాలు మృతి

పెద్దకడబూరు: చిరుత దాడిలో రెండు జీవాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు నక్కల ఈరన్న తెలిపిన వివరాలు మేరకు గ్రామ సమీపంలోని మేకలను, గొర్రెలను దొడ్డిలో ఆపి ఇంటికి వెళ్లారి. అర్ధరాత్రి 12గంటల తర్వాత మందపై చిరుత దాడి చేసి ఒక మేక, ఒక గొర్రెను చంపేసింది. దాదాపు రూ. 20వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు నక్కల ఈరన్న తెలిపారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 850.60 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం ఆదివారం సాయంత్రం సమయానికి 850.60 అడుగులకు చేరుకుంది. సెల్ఫ్‌క్యాచ్‌మెంట్ ఏరియాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 400 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. శనివారం డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 12.20 మి.మీ వర్షం కురిసింది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.169 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 4,185 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 2,250 క్యూసెక్కులు, హంద్రీ-నీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కులు , కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 81.4594 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తుది దశకు ఇంటింటా ఓటరు సర్వే

- ఇప్పటికే 99.55 శాతం పూర్తి
- 19,59,689 ఓటర్లకుగాను 19,50,901 ఓటర్ల వివరాలను పరిశీలించిన బీఎల్‌ఓలు
- అనుమానాస్పద ఓటర్లపై మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ
- అక్టోబర్ 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు కసరత్తు



పత్తికొండలో ఇంటింటా సర్వేలో పాల్గొన్న ఆర్‌డీఓ మోహన్‌దాస్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమం తుది దశకు చేరుకుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి 99.55 శాతం ఓటర్ల వివరాలను పరిశీలించారు. మిగిలిన ఓటర్ల వివరాలను మరో రెండు, మూడు రోజుల్లో పరిశీలించి సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

క్షేత్ర స్థాయిలో మరోసారి విచారణ..

కర్నూలు జిల్లాలో మొత్తం 8,03,689 కుటుంబాలు ఉన్నాయి. 2023 జనవరి 5వ తేదీన ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రకారం 19,59,686 మంది ఓటర్లు ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలించడం, అందులో చనిపోయిన ఓటర్లు, రెండు చోట్లా ఓటు ఉన్న వారు, ఇతర కారణాలతో డూప్లికేట్ ఓటర్లుగా ఉన్న వారిని తొలగించడం, 2024 జనవరి ఒకటో తేదీ నాటికీ 18 ఏళ్ల నిండే యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించడం కోసం ఎన్నికల సంఘం ఇంటింటా సర్వేకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా జూలై 21 నుంచి సర్వే కొనసాగుతోంది. బీఎల్‌ఓలతో ఇంటింటా సర్వే చేసి జాబితాలో పొల్చి సరైన వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 19,50,901 ఓటర్ల వివరాలను బీఎల్‌ఓలు ఇంటింటా వెళ్లి పరిశీలన చేసి సేకరించారు. ఇక కేవలం 9 వేల ఓటర్ల వివరాలను మాత్రమే పరిశీలించాల్సి ఉంది.

అనుమానాస్పద ఓటర్లు..

ఓటరు జాబితా సంక్షిప్త సవరణ-2024లో భాగంగా బీఎల్‌ఓలు చేస్తున్న ఆన్‌లైన్ సర్వేలో అనుమానాస్పద ఓటర్ల వివరాలు బయట పడుతున్నాయి. మొత్తం 19,16,875 ఓటర్లలో 59,672 మంది మరణించినట్లు బీఎల్‌ఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అలాగే రెండు, మూడు చోట్ల ఓటు ఉన్న వారు 10,566 మంది, ఓటరు గుర్తింపు కార్డుపై ఫొటో సరిగా లేనివారు 7,132 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇళ్లు మారిన కుటుంబాలు 27,599, సర్వేకు వెళ్లిన సమయంలో ఇళ్లలో లేని కుటుంబాలు 24,612 ఉన్నాయి. వీటన్నింటిపై రాజకీయ పార్టీల ఏజెంట్లు, సమీపంలోని ఓటర్లతో విచారణ జరిపి తొలగించడమో లేదంటే కొనసాగించడమో చేయనున్నారు. అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆలోపు ఆయా ఓటర్ల వివరాలపై మరోసారి క్షేత్రస్థాయిల్లో విచారణ చేయాల్సి ఉంది. ఇందులో రాజకీయ పార్టీలు ఎక్కువ పాత్ర పోషించాల్సి ఉంటుంది. ప్రతి ఓటరును పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏజెంట్లతో విచారణ చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే డూప్లికేట్ , బోగస్ ఓటర్ల వివరాలు జాబితాలోకి వస్తాయి.

మా ఇంటికీ ఎవరూ రాలేదనకూడదు

ఓటరు సంక్షిప్త సవరణలో భాగంగా జిల్లాలోని 8,03,689 కుటుంబాలను చుట్టి వచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపు 99.55 శాతం ఇళ్లను బీఎల్‌ఓలు చుట్టి వచ్చారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో రాజకీయ పార్టీల ఏజెంట్లతో కలుపుకొని సర్వే చేపడుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 8.01 లక్షల కుటుంబాల్లో సర్వే పూర్తయ్యింది. మిగిలిన కుటుంబాల్లో రెండు, మూడు మూడు రోజుల్లో సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి

జిల్లాలో ఓటరు సంక్షిప్త సవరణ జాబితా-2024లో భాగంగా ఇంటింటా సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సర్వే కొనసాగుతోంది. బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల ఏజెంట్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు 99.55 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన సర్వే రెండు, మూడు రోజుల్లో పూర్తవుతుంది.

– నారపురెడ్డి మౌర్య, జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్